సాక్షి
బాపట్ల
గురువారం । 1 । జూన్ । 2023



నిమ్మకాయల ధరలు

తెనాలిటౌన్: గుంటూరు జిల్లా తెనాలి మార్కెట్ యార్డులో బుధవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.800, గరిష్ట ధర రూ.1900, మోడల్ ధర రూ.1200 వరకు పలికింది.



రైల్వే స్టేషన్‌లో వార్షిక తనిఖీలు

విజయవాడ పశ్చిమ : రైల్వే ఏడీజీపీ కుమార్ విశ్వజిత్ బుధవారం విజయవాడలో పర్యటించారు. ముందుగా విజయవాడ రైల్వే ఎస్పీ కార్యాలయాన్ని సందర్శించి వార్షిక తనిఖీలు చేపట్టారు.



జలకాలాటలలో శిక్షణ

వేసవి శిక్షణ శిబిరాలు ఉత్సాహంగా సాగుతున్నాయి. విజయవాడలోని పున్నమీ ఘాట్ సమీపంలో చిన్నారులకు వాటర్ స్పోర్ట్స్‌లో బుధవారం శిక్షణనిచ్చారు.

కిలహాల నవ్వులు

- సాగు సాయానికి వేళాయె..!
- కర్షకులకు పెట్టుబడి సాయం
- ఏటా ఆదుకుంటున్న వైఎస్ జగన్ ప్రభుత్వం
- నేడు రైతుభరోసా, పీఎం కిసాన్ నగదు జమ
- 1.70 లక్షల రైతు కుటుంబాలకు రూ.137.14 కోట్లు
- ఐదేళ్లలో రూ.1059.91 కోట్లు ఇచ్చిన ప్రభుత్వం



సాక్షి ప్రతినిధి, బాపట్ల:సేద్యం సుభిక్షమవుతోంది. రైతు ఇంట సంక్షేమ సిరులు కురుస్తున్నాయి. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టిన నాటి నుంచి కర్షకులకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. రైతు భరోసా–పీఎం కిసాన్ పథకం ద్వారా ఏడాదికి రూ.13,500 చొప్పున పెట్టుబడి సాయం అందించడమే కాకకుండా ఆర్‌బీకేలను ఏర్పాటు చేసి విత్తు నుంచి పంట విక్రయాల వరకు అండగా నిలుస్తోంది. గిట్టుబాటు ధర కల్పిస్తోంది. విపత్తులు సంభవించినప్పుడు పంట నష్టపోతే పరిహారం అందజేస్తోంది. ఆరుగాలం రైతుకు సూచనలు, సలహాలు అందిస్తోంది. ఉచిత బీమా పథకం అమలు చేస్తోంది. సూక్ష్మ సేద్య పరికరాలు అందజేస్తోంది. తాజాగా వరుసగా ఐదో విడత రైతు భరోసా సాయం అందించేందుకు జన హృదయ విజేత ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సంసిద్ధులవుతున్నారు. గురువారం నగదు జమను ఆయన అట్టహాసంగా కర్నూలు జిల్లా పత్తికొండ నుంచి ప్రారంభించనున్నారు.



సేద్యమేవ జయతే : వరి నారు తీస్తున్న కూలీలు (పాతచిత్రం)

ఖరీఫ్ సీజన్ ముందే

కర్షకులు సాగు ప్రారంభంలో పెట్టుబడికి అర్రులు చాచకుండా ప్రభుత్వం ఖరీఫ్ సీజన్‌కు ముందే ఏటా రైతుభరోసా పెట్టుబడి సాయం అందజేస్తున్న విషయం తెలిసిందే. ఈ ఏడాదీ సీజన్ ఆరంభం కాకముందే గురువారం సాయం జమకు ఏర్పాట్లు పూర్తి చేసింది. ఈ విడతలో 1,70,965 మంది రైతు కుటుంబాలకు రూ.137.14 కోట్లను శుక్రవారం సీఎం బటన్‌నొక్కి రైతుల ఖాతాలో జమచేయన్నారు. ఇప్పటికే అర్హుల జాబితాను 410 రైతు భరోసా కేంద్రాల్లో ప్రదర్శించారు. ఇంకా అర్హత కలిగిన వారు ఉండి జాబితాలో పేరు లేకపోతే అధికారుల దృష్టికి తీసుకెళ్లవచ్చు. అధికారులు పరిశీలించి పెట్టుబడి సాయం అందేలా చూస్తారు.

ఐదు విడతలుగా అందిన పెట్టుబడి సాయం ఇలా

సంవత్సరం	లబ్ధిదారులు	చేకూరిన ప్రయోజనం (రూ.కోట్లలో)
2019–20	1,62,482	219.03
2020–21	1,75,207	236.53
2021–22	1,71,265	231.21
2022–23	1,79,165	235.68
తాజాగా జూన్ 1న	1,70,965	137.14
మొత్తం		1059.91

నియోజకవర్గాలవారీగా లబ్ధిదారులు ఇలా

నియోజకవర్గం	లబ్ధిదారుల సంఖ్య
అద్దంకి	44,176
చీరాల	6,335
పర్చూరు	41,318
బాపట్ల	19,105
రేపల్లె	30,163
వేమూరు	29,868

రైతు బాంధవుడు జగన్



నాకు 1.92 ఎకరాల పొలం ఉంది. జగన్ ప్రభుత్వం ఇస్తున్న రైతు భరోసా, పీఎం కిసాన్ మొత్తం ఏటా నా ఖతాలో జమవుతోంది. సాగు ప్రారంభానికి ముందుగానే రైతులకు ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడం సంతోషంగా ఉంది. చిన్న, మధ్యతరగతి రైతులకు ఇది ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– గొట్టిపాటి వెంకట్రావు, రైతు, యద్దనపూడి

సీఎంకు రుణపడి ఉంటాం



నాకు 4.05 ఎకరాల పొలం ఉంది. డాక్టర్ వైఎస్సార్ రైతుభరోసా, పీఎం కిసాన్ ద్వారా ఏటా నగదు ఖాతాలో జమవుతోంది. ఖరీఫ్‌కు ముందే ప్రభుత్వం పెట్టుబడి సాయం అందించడం చాలా సంతోషంగా ఉంది. ఇది మాలాంటి రైతులకు ఎంతో ఉపయోగంగా ఉంటుంది.

– పెండియాల సుబ్బారావు, రైతు తూర్పుకొప్పరపాడు

వ్యవసాయానికి దన్నుగా పెట్టుబడి సాయం



వ్యవసాయ రంగాన్ని బలోపేతం చేసేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది. రైతుభరోసా, పీఎం కిసాన్ పేరుతో పెట్టుబడి సాయాన్ని అందిస్తోంది. సుమారు 1.70 లక్షల మంది రైతులకు ఏటా లబ్ధి చేకూరుతోంది. ఈ ఏడాది 1,70,965 మంది రైతులకు 137.14 కోట్లు మొత్తాన్ని జూన్ 1న ముఖ్యమంత్రి బటన్‌నొక్కి జమచేయనున్నారు.

– అబ్దుల్ సత్తార్, జేడీఏ

న్యూస్‌రీల్

న్యాయ సలహా కేంద్రం తనిఖీ

నరసరావుపేట: స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహిస్తున్న న్యాయ సలహా కేంద్రాన్ని అదనపు సీనియర్ సివిల్ న్యాయమూర్తి మధుస్వామి బుధవారం తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. ఆర్డీవో ఎం.శేషిరెడ్డి, సలహా కేంద్ర న్యాయవాది శ్రీరామినేని ప్రసాదు హాజరయ్యారు.

కొనసాగుతున్న పాలిసెట్ సర్టిఫికెట్ల పరిశీలన



గుంటూరు ఎడ్యుకేషన్: పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశం కోసం ఉద్దేశించిన పాలిసెట్–2023 సర్టిఫికెట్ల పరిశీలన ప్రక్రియ కొనసాగుతోంది. గుంటూరు నగర శివారు నల్లపాడులోని ఎంబీటీఎస్ ప్రభుత్వ పాలిటెక్నిక్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌లైన్ కేంద్రంలో బుధవారం 234 మంది విద్యార్థులు హాజరయ్యారు. హెల్ప్‌లైన్ కేంద్ర సమన్వయకర్త టి.శేఖర్ పర్యవేక్షణలో వివిధ శాఖల అధికారులు పాల్గొని విద్యార్థుల సర్టిఫికెట్లు పరిశీలించారు. గురువారం జరిగే సర్టిఫికెట్ల పరిశీలనకు 43,001 నుంచి 59వేల ర్యాంకు వరకు విద్యార్థులు హాజరు కావాల్సి ఉంది.

డ్రై,లిక్విడ్ గంజాయిని నిర్వీర్యం చేయాలి



నగరంపాలెం(గుంటూరు వెస్ట్): స్వాధీనం చేసుకున్న గంజాయిని త్వరగా నిర్వీర్యం చేయాలని ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ ఆదేశించారు. మంగళగిరి రూరల్, పట్టాభిపురం, పొన్నూరు పోలీస్‌స్టేషన్ల (పీఎస్) పరిధిలో సీజ్ చేసిన డ్రై, లిక్విడ్ గంజాయిని బుధవారం పోలీస్‌పెరేడ్ గ్రౌండ్‌కు తరలించగా ఎస్పీ పరిశీలించారు. జిల్లా డ్రగ్స్ డిస్పోజల్ కంట్రోల్ కమిటీ చైర్మన్ హోదాలో కమిటీ సభ్యుల సమక్షంలో ఎలక్ట్రానిక్ పరికరంతో పరిశీలించారు. కొద్ది రోజులుగా ఆయా పీఎస్‌ల పరిధిలో స్వాధీనం చేసుకున్న సుమారు 476 కిలోల డ్రై/లిక్విడ్ గంజాయిని పద్ధతి ప్రకారం డిస్పోజల్ చేయాలని అధికారులను ఎస్పీ ఆదేశించారు. ఏఎస్పీ (క్రైం) శ్రీనివాసరావు, డీసీఆర్‌బీ డీఎస్పీ శ్రీనివాసరావు పాల్గొన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు విస్తృత ఏర్పాట్లు

గుంటూరు ఎడ్యుకేషన్: ఈనెల రెండో తేదీ నుంచి జరగనున్న టెన్త్ అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలకు గుంటూరు జిల్లా వ్యాప్తంగా 27 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు డీఈఓ పి.శైలజ బుధవారం తెలిపారు. ఈనెల 10న జరగనున్న పరీక్షలకు 5,422 మంది విద్యార్థులు దరఖాస్తు చేసినట్లు వివరించారు. ఉదయం 9.30 గంటల నుంచి మధ్యాహ్నం 12.45 వరకు పరీక్షలు జరగనుండగా, విద్యార్థులను ఉదయం 8.45 నుంచి 9.30 గంటలోపే అనుమతిస్తామని స్పష్టం చేశారు. హాల్ టికెట్, పెన్ను మినహా మరే ఇతర ఎలక్ట్రానిక్ వస్తువులను పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించబోమని చెప్పారు. పరీక్ష కేంద్రం చీఫ్ సూపరింటెండెంట్ సహా పరీక్షల విధుల్లో ఉన్న అధికారులు, ఉద్యోగులు సెల్‌ఫోన్లు తీసుకొచ్చేందుకు అనుమతి లేదని స్పష్టం చేశారు.

రత్నగిరి కాలనీలో జింక గుర్తింపు

నగరంపాలెం(గుంటూరువెస్ట్): గుంటూరు రూరల్ మండల పరిధిలోని రత్నగిరికాలనీ సమీపంలోని పొలాల్లో బుధవారం అటవీ శాఖ అధికారులు జింకను పట్టుకున్నారు. స్ట్రైకింగ్ ఫోర్స్ సభ్యులు సతీష్ కుమార్, అబ్దుల్‌రహీం తోపాటు స్థానికులు సహాయంతో జింకను పట్టుకుని ప్రథమ చికిత్స అందించారు. అనంతరం పల్నాడు జిల్లా నరసరావుపేట సమీపంలోని అటవీ ప్రాంతంలో వదిలేశారు. అమరావతి మండలం లేమల్లె అటవీ ప్రాంతం నుంచి నీటి కోసం జింక వచ్చి ఉంటుందని ఆ శాఖ అధికారి సంతోష్‌కుమార్ తెలిపారు. వేసవి దృష్ట్యా దాహార్తి కోసం దారి తప్పి వచ్చే అటవీ జంతువులు కనిపిస్తే తెలియజేయాలని కోరారు.

తనిఖీల్లో 23 కేసులు

పట్నంబజారు(గుంటూరు): రవాణా శాఖ అధికారుల ఆధ్వర్యంలో బుధవారం గుంటూరు జిల్లాలో మిషన్‌లైఫ్ కార్యక్రమంలో భాగంగా వాహన కాలుష్యంపై తనిఖీలు జరిగాయి. 23 కేసులు నమోదు చేశారు. కార్యక్రమంలో ఎంవీఐ గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

యుద్ధ అమరుల కుటుంబాలకు స్థలాలు

కలెక్టర్ రంజిత్‌బాషా



బాపట్ల: యుద్ధ వీరుల కుటుంబాలకు తక్షణమే నివాస స్థలాలు పంపిణీ చేస్తామని కలెక్టర్ పి.రంజిత్ బాషా తెలిపారు. జిల్లా సైనిక బోర్డు కొత్త కమిటీ తొలి సమావేశం బుధవారం స్థానిక కలెక్టర్ చాంబర్లో బుధవారం జరిగింది. యుద్ధంలో మృతి చెందిన సైనిక కుటుంబాలకు జీఓ నెం.92 ఆధారంగా 300 చదరపు అడుగుల నివాస స్థలాన్ని ఇస్తామని కలెక్టరు చెప్పారు. బాపట్ల జిల్లాలో యుద్ధంలో అమరులైన సైనికుల కుటుంబాలు 16 ఉన్నాయని, దివ్యాంగులైన మరో 8 మంది సైనికులు ఉన్నారని వివరించారు. వీరి వివరాలను సేకరించి తక్షణమే నివేదిక పంపాలని సైనిక సంక్షేమ శాఖ అధికారిణిని ఆదేశించారు. నెలరోజుల్లో ఈ ప్రక్రియ పూర్తి చేస్తామని పేర్కొన్నారు. జీఓ నంబర్ 371 ఆధారంగా మాజీ సైనికులకు ఇంటి పన్ను మినహాయింపు పక్కాగా అమలు చేస్తామని వివరించారు. రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో ఉన్న ఉద్యోగాల భర్తీలో మాజీ సైనికులకు 2శాతం రిజర్వేషన్లు పక్కాగా అమలు చేస్తామని వెల్లడించారు. ఒప్పంద, పొరుగు సేవల విధానంలోనూ రిజర్వేషన్ వర్తిస్తుందని వివరించారు. ఉద్యోగవిరమణ పొందిన మాజీ సైనికులకు 2.5 ఎకరాల సాగుభూమి లేదా ఐదు ఎకరాల మెట్టభూమి పంపిణీకి చర్యలు తీసుకుంటామన్నారు. గతంలో భూపంపిణీ జరిగి పదేళ్లు దాటిన పట్టాలను 22ఏ నుంచి తొలగించడానికి ప్రతిపాదనలు పంపాలని అధికారులను ఆదేశించారు. సైనికుల సంక్షేమం కోసం ఫ్లాగ్ డే కార్యక్రమంలో భాగంగా విరాళాల సేకరణ చేపట్టాలన్నారు. సైనిక రెస్ట్ హౌస్, సీఎస్‌డీ క్యాంటీన్, ఈసీహెచ్‌ఎస్, సైనిక సంక్షేమ శాఖ కార్యాలయాల నిర్మాణానికి 80 సెంట్లు భూమిని గుర్తించాలని సూచించారు. మృతిచెందిన సైనికుల భార్యలకు అంగన్‌వాడీ ఉద్యోగాలు, నిజాంపట్నంలో సీఎస్‌డీ క్యాంటీన్ ఏర్పాటు, బాపట్లలో మాజీ సైనికులు హెల్త్ క్లినిక్, కేంద్రియ విద్యాలయానికి స్థలం కేటాయించాలని కమిటీ తీర్మానాలపై కలెక్టర్ చర్చించారు. సమావేశంలో జిల్లా సైనిక సంక్షేమశాఖ అధికారిణి గుణశీల పాల్గొన్నారు.

అసంతృప్తి 'కన్నా'రా

- సత్తెనపల్లిలో టీడీపీకి నాలుగో కృష్ణుడు
- కన్నా లక్ష్మీనారాయణకు ఇన్‌చార్జిగా బాధ్యతల అప్పగింత
- ఇప్పటికే వర్గపోరు పార్టీ శ్రేణుల్లో నిస్తేజం
- తాజాగా నాలుగు స్తంభాలాటకు అధిష్టానం ఆజ్యం
- కన్నాకు సత్తెనపల్లికి రావడం ఇష్టం లేదని టాక్



సత్తెనపల్లి: సత్తెనపల్లి టీడీపీలో ముసలం మరింత ముదరనుందా? ఇప్పటి వరకు సీటు తమదంటే తమదంటూ పావులు కదిపిన నేతలు.. ఇకపై తమ అసమ్మతి గళం వినిపించనున్నారా ? ఇప్పటికే ప్రజల్లో మెండైన సానుకూలతతో వైఎస్సార్ సీపీ బలంగా ఉంది. టీడీపీ సత్తెనపల్లి ఇన్చార్జిగా కన్నా లక్ష్మీనారాయణ ఇష్టపడే వస్తున్నారా? తప్పనిసరి పరిస్థితుల్లోనా! అనేది స్పష్టత కొరవడింది. పెదకూరపాడు కాని, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాన్ని కానీ కన్నా ఆశించారనేది సన్నిహితుల మాట. మరికొద్ది నెలల్లో సార్వత్రిక ఎన్నికలు రానున్నాయి. ఈ నేపథ్యంలో రాజకీయ పార్టీలు వ్యూహాలకు పదును పెడుతున్నాయి. ఇప్పటికే అధికార వైఎస్సార్ సీపీ సంక్షేమ పథకాల ద్వారా ప్రజల్లోకి బలంగా వెళుతోంది. అదే సమయంలో మహానాడు ద్వారా పార్టీకి ఉత్సాహాన్ని తీసుకొద్దామనుకున్న చంద్రబాబు.. కాపీ మేనిఫెస్టోతో బొక్కబోర్లా పడ్డారు. ఈ క్రమంలో పార్టీలో చేరిన మూడు నెలల తర్వాత సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జిగా కన్నా లక్ష్మీనారాయణకు బాధ్యతలు అప్పగించారు. ఈ మేరకు ఆ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు ప్రకటించారు. ఈ మార్పుపై పార్టీలో భిన్నమైన టాక్ వినిపిస్తోంది.

నాలుగు స్తంభాలాట

గత ఎన్నికల్లో సత్తెనపల్లి నియోజకవర్గం నుంచి టీడీపీ అభ్యర్థిగా పోటీ చేసిన కోడెల శివప్రసాదరావు ఓటమి పాలయ్యారు. ఆయన అకాల మరణంతో ఇన్‌చార్జి బాధ్యతలను అధిష్టానం ఎవరికీ అప్పగించలేదు. కోడెల శివప్రసాదరావు తనయుడు శివరామ్ పార్టీ కార్యకలాపాలు కొనసాగిస్తున్నారు. మన్నెం శివనాగమల్లేశ్వరరావు(అబ్బూరి మల్లి), మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు కూడా పార్టీ కార్యక్రమాలు చేపట్టడంతో మూడు గ్రూపులుగా విడిపోయారు. ఈ వర్గపోరుకు ఆజ్యం పోస్తున్నట్టు ఆ పార్టీ అధిష్టానం తాజాగా కన్నా లక్ష్మీనారాయణను సత్తెనపల్లి నియోజకవర్గ ఇన్‌చార్జిగా నియమించింది. దీంతో మాజీ ఎమ్మెల్యే వైవీ ఆంజనేయులు, కోడెల శివరామ్, మన్నెం శివనాగమల్లేశ్వరరావు ఆందోళనలో ఉన్నారు. దీనివల్ల గ్రూపు విభేదాలు, అసంతృప్తులు మరింత పెరగడం ఖాయమని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు.

కన్నాకు కాపు కాసేది లేదు...

తొలి నుంచి కన్నా లక్ష్మీనారాయణ కాంగ్రెస్ పార్టీలో క్రియాశీలకంగా వ్యవహరించారు. 1989, 1994, 1999, 2004లలో పెదకూరపాడు నుంచి గెలిచారు. 2009లో గుంటూరు పశ్చిమ నుంచి గెలుపొందారు. ఈ నేపథ్యంలో కన్నా గురి కూడా పెదకూరపాడు, గుంటూరు పశ్చిమ నియోజకవర్గాలపైనే ఉందని ఆయన సన్నిహితుల మాట. సత్తెనపల్లి నియోజకవర్గంలో ఇప్పటికే కాపు సామాజికవర్గానికి చెందిన అంబటి రాంబాబు మంత్రిగా ఉన్నారు. ఇక్కడ అంబటి రాంబాబు తొలి నుంచి కాపులతోపాటు బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలకు అండగా నిలుస్తున్నారు. 2009లో టీడీపీ నుంచి ఓటమిపాలైన నిమ్మకాయల రాజనారాయణ యాదవ్, ఆయనపై గెలుపొందిన మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి (2004లోనూ గెలుపొందారు), కాపు సంఘ నేత పక్కాల సూరిబాబు వైఎస్సార్ సీపీలో చేరడంతో అధికారపార్టీ బలం పెరిగింది. ఈ నేపథ్యంలో సత్తెనపల్లి టీడీపీ ఇన్‌చార్జిగా ఉండేందుకు కన్నా కూడా విముఖంగా ఉన్నట్లు తెలుస్తోంది.

వైభవంగా గోపీనాథస్వామి ఆలయ పునఃప్రతిష్ఠ



విమాన శిఖర కలశాలకు పూజలు నిర్వహిస్తున్న మంత్రి విడదల రజిని, కుమారస్వామి దంపతులు

చిలకలూరిపేట: పురుషోత్తమపట్నంలో రుక్మిణీ సత్యభామ సమేత గోపీనాథస్వామి ఆలయ పునఃప్రతిష్ఠా మహోత్సవం బుధవారం నిర్వహించారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ధ్వజస్తంభ ప్రతిష్ఠ, విమాన శిఖరస్థాపన జరిపించారు. స్వామికి ప్రాణప్రతిష్ఠ, జీవకళాన్యాసం, ప్రత్యేక అలంకరణ, స్వామి దర్శనం ఏర్పాటు చేశారు. రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని సహకారంతో దేవదాయ, టీటీడీ నిధులతో నిర్వహించిన పునఃప్రతిష్ఠా మహోత్సవంలో మంత్రితోపాటు ఆమె కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. భక్తులు భారీగా తరలివచ్చారు. అనంతరం భారీ అన్నదానం జరిగింది. కార్యక్రమంలో మంత్రి కుటుంబ సభ్యులు విడదల లక్ష్మీనారాయణ, విడదల కుమారస్వామి, విడదల గోపీనాథ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ తోట రాజేంద్రప్రసాద్, రామచంద్రప్రసాద్ పాల్గొన్నారు.

9వ తరగతి విద్యార్థినికి వేధింపులు

తాడేపల్లిరూరల్ : మంగళగిరి–తాడేపల్లి నగరపాలక సంస్థ పరిధిలోని వడ్డేశ్వరంలో 9వ తరగతి చదువుతున్న విద్యార్థినిని ఓ బైక్ మెకానిక్ వెంబడించి వేధించాడు. ఈ ఘటనపై తాడేపల్లి పోలీసులు బుధవారం పోక్సో కేసు నమోదు చేసి నిందితుడిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరిచారు.

ఆపద్బాంధవులు



రక్షించిన బాలికలతో పోలీసులు

బాపట్ల టౌన్: సూర్యలంక సముద్ర తీరంలో అలల తాకిడికి కొట్టుకుపోతున్న ఇద్దరు బాలికలను పోలీసులు బుధవారం కాపాడారు. పొన్నూరుకు చెందిన కుంచాల క్రాంతిమయి, సుద్దపల్లి మాలతి సముద్రస్నానానికి వచ్చి అలల ఉధృతిలో చిక్కుకున్నారు. కొట్టుకుపోతున్న వారిని గమనించిన హెడ్ కానిస్టేబుల్ ఎం.పోతురాజు, కానిస్టేబుల్ నాగరాజు, హోంగార్డులు ఎస్.శ్రీనివాసరావు, గజఈతగాళ్ళు సంగాని సురేష్, కొక్కిలిగడ్డ మస్తాన్ కాపాడారు. చికిత్స నిమిత్తం ఏరియా వైద్యశాలకు పంపారు. బాలికలను కాపాడిన పోలీసు సిబ్బందిని ఎస్పీ వకుల్ జిందాల్ అభినందించారు.

జగనన్న వచ్చిన తర్వాతే మాకు భరోసా

- వలంటీర్ల వల్లే మా జీవితాలకు గుర్తింపు
- ఇప్పుడు మాకు సొంత స్థలం కూడా వచ్చింది
- ఇళ్లు కట్టిస్తామంటున్నారు
- కాగితాలు ఏరుకుని జీవించే కటిక పేదల ఆనందం



ఎమ్మెల్యే ఆర్కేతో కలిసి ఆనందం వ్యక్తం చేస్తున్న చిత్తుకాగితాలు ఏరుకునే కటిక పేదలు

తాడేపల్లిరూరల్ : ''గతంలో ఏ ప్రభుత్వం వచ్చినా, ఏ అధికారి పర్యటించినా మొట్టమొదటగా మా గుడిసెలనే తొలగించేవాళ్లు. అప్పటికప్పుడు తట్టాబుట్టా సర్దుకుని ఖాళీ స్థలం ఎక్కడుందో చూసుకుని పాకలు వేసుకునేవాళ్లం. అలాంటిది జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మాకు భరోసా లభించింది. వలంటీర్ల ద్వారా ఆధార్ కార్డు, రేషన్ కార్డు వచ్చాయి. ప్రభుత్వ సంక్షేమ పథకాల ద్వారా డబ్బులు అందుతున్నాయి. జగనన్నతోనే మా బతుకుల్లో మార్పులు వచ్చాయి'' అంటూ రోడ్ల వెంబడి చిత్తు కాగితాలు ఏరుకుని అమ్ముకుని జీవించే కటిక పేదలు జగనన్నకు జేజేలు పలికారు. బుధవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని వడ్డేశ్వరం, మెల్లెంపూడి ప్రాంతాల లబ్ధిదారులకు ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి(ఆర్కే) ఇళ్లస్థల పట్టాలను అందజేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులు భావోద్వేగానికి లోనయ్యారు. ఆనందబాష్పాలతో ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి వద్ద సంతోషం వ్యక్తం చేశారు. గతంలో పడిన కష్టాలను వివరించారు.

చాలా చోట్లకు మారాం..

''2014లో కృష్ణా నది ఒడ్డున నివాస ఉండేవాళ్లం. అప్పట్లో గుళ్లకు సంబంధించిన అధికారులు వచ్చి గుడి ముందు మీ ఇళ్లేంటంటూ తొలగించారు. ఆ తరువాత రైల్వే బ్రిడ్జి కింద పుష్కర ఘాట్ల వద్ద గుడిసెలు వేసుకున్నాం. పుష్కరాల పేరుతో వాటినీ తొలగించారు. అనంతరం కొలనుకొండ దగ్గర రోడ్డు వెంబడి గుడిసెల వేసుకుని ఉంటుంటే అక్కడా తీయించేశారు. వడ్డేశ్వరంలో రైల్వే ట్రాక్ దగ్గరకు మారగా, పోలీసులను తీసుకువచ్చి ఖాళీ చేయించారు. అట్లా మరో రెండు చోట్ల మారిన తరువాత జగనన్న ప్రభుత్వం వచ్చింది. తమ నివాసాలు తొలగిస్తుంటే అక్కడి వలంటీర్ సమస్యను తహసీల్దార్ దృష్టికి తీసుకువెళ్లారు. ఇప్పటంలో తాత్కాలికంగా చోటు చూపించారు. అక్కడే నివాసం ఉంటున్నాం. వలంటీర్లు మా ఇంటి చుట్టూ తిరిగి మా పిల్లలను బడిలో చేర్పించి, ఆధార్‌కార్డులు, రేషన్ కార్డులు ఇప్పించి నెలనెలా రేషన్ ఇప్పిస్తున్నారు. మా అందరికీ ఇప్పుడు అమ్మఒడి కూడా వస్తోంది. మేము పుట్టిబుద్ధి ఎరిగిన తర్వాత ఏ ప్రభుత్వంలోనూ మాకు గౌరవం దక్కలేదు. జగనన్న ప్రభుత్వమే అక్కున చేర్చుకుంది. మాకు ఇప్పుడు ఓటు హక్కు కూడా ఉంది. జగనన్న పుణ్యమా అంటూ మాకు ఇంటి స్థలం కూడా వచ్చింది. జగనన్న మాకు ఇంటిని నిర్మించి ఇస్తే మా పిల్లలకు పూర్తి భరోసా ఉంటుందని'' అని సంతోషం వెలిబుచ్చారు.

మా పిల్లలు బడికి వెళ్తున్నారు



జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మా పిల్లలు బడికి వెళుతున్నారు. వలంటీర్లు మా ఇంటికే వచ్చి అన్ని పథకాలూ అందజేస్తున్నారు. రేషన్ ఇప్పిస్తున్నారు. ఇప్పుడు స్థలం ఇచ్చారు. చాలా ఆనందంగా ఉంది.

– యాటగిరి తిరుపతమ్మ, వడ్డేశ్వరం

మా జీవితాల్లో ఎంతో మార్పు



నాకు ఇద్దరు పిల్లలు. చిత్తు పేపర్లు ఏరుకుని బతుకుతున్నాం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మా ఇద్దరు పిల్లల్ని స్కూల్‌కు పంపిస్తున్నాం. మాకు అమ్మఒడి కూడా వచ్చింది. మా పిల్లలు ఇద్దరూ రెండో క్లాసు, 4వ క్లాసు చదువుతున్నారు. మాకు ఎంతో ఆనందంగా ఉంది. జగనన్న దయతో ఇంటి స్థలం వచ్చింది. త్వరలో ఇల్లు కట్టుకుంటాం. మా జీవితాల్లో ఎంతో మార్పు వచ్చింది.

రసిగిరి మీనమ్మ, వడ్డేశ్వరం

కలగా ఉంది.



మేము ఎక్కడ గుడిసె వేసుకుని ఉంటున్నా మమ్మల్ని అంటరానివారిగా చూసేవాళ్లు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మా బతుకుల్లో మార్పులు వచ్చాయి. ఇదంతా కలగా ఉంది. ఈ ప్రభుత్వం సమాజంలో మమ్మల్ని కూడా గుర్తించింది. అందరితో పాటు మాకు కూడా ఇంటి స్థలం ఇవ్వడం ఆనందంగా ఉంది.

– ఎకవేరి హరికృష్ణ, వడ్డేశ్వరం

క్లుప్తంగా

గ్రానైట్ పరిశ్రమను ఆదుకోవాలని వినతి

బల్లికురవ: సంక్షోభంతో ఎగుమతులు నిలిచిపోయిన గ్రానైట్ క్వారీ, పరిశ్రమలను ఆదుకోవాలని బల్లికురవ క్వారీలు, పరిశ్రమల సంఘ అధ్యక్షుడు గుంటక తిరుపతి రెడ్డి, ప్రత్తిపాటి సురేష్, సీహెచ్ మస్తానయ్య విన్నవించారు. కలెక్టర్ రంజిత్ బాషా, జేసీ శ్రీధర్‌ను మర్యాదపూర్వకంగా కలసి బుధవారం వినతిపత్రం అందజేశారు. ఎగుమతులు రోజురోజుకు పెరుగుతున్న రేట్లతో ఇబ్బందులు పడుతున్నట్లు వినతిపత్రంలో పేర్కొన్నారు.

మద్యం విక్రేతపై పీడీ యాక్ట్

నరసరావుపేట: నాటుసారా, పక్క రాష్ట్రాల నుంచి మద్యం తీసుకొచ్చి విక్రయిస్తూ అనేక కేసుల్లో పట్టుబడిన బంగ్లా హరికృష్ణను ప్రివెంటీవ్ డిటెన్షన్ చట్టం-1950(పీడీ) కింద స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో(ఎస్ఈబీ) పోలీసులు అరెస్టు చేసి బుధవారం రాజమండ్రి సెంట్రల్ జైలుకు తరలించారు. జిల్లా కలెక్టర్ ఎల్.శివశంకర్ ఆదేశాల మేరకు ఎక్సైజ్ సూపరింటెండెంట్ కె.చంద్రశేఖర్‌రెడ్డి సారథ్యంలో పమిడిపాడుకు చెందిన హరికృష్ణను అరెస్టు చేసినట్లు ఎస్ఐ సురేంద్ర తెలిపారు. హరికృష్ణ నాటు సారా తయారీతో పాటుగా తెలంగాణ, గోవాల నుంచి మద్యం తీసుకొచ్చి ఈ ప్రాంతంలోని పలు గ్రామాలకు సరఫరా చేస్తున్నాడని చెప్పారు. ఇతడిపై ఐదు కేసులు నమోదు అయినట్లు వివరించారు. ఈనేపథ్యంలో పీడీ యాక్టు అమలు చేసినట్లు పేర్కొన్నారు.

పొగాకు ఉత్పత్తులకు దూరంగా ఉండాలి

నరసరావుపేట: పొగాకు, వాటి ఉత్పత్తులైన చుట్ట, బీడీ, సిగరెట్, గుట్కా, ఖైనీ వంటి వాటిని త్రాగటం, తినటం వలన నోటి క్యాన్సర్, ఇతర ప్రాణాంతక వ్యాధులు వస్తాయని అటువంటి వాటికి దూరంగా ఉండాలని ఇన్‌చార్జి డీఎండీహెచ్‌ఓ, జిల్లా ఇమ్యూనైజేషన్ అధికారి డాక్టర్ గీతాంజలి సూచించారు. 'ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవం' సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన ర్యాలీని బుధవారం ఆమె ప్రారంభించారు. జిల్లా వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆరోగ్య కార్యకర్తలు, ఆశ కార్యకర్తలు అందరితో ప్రపంచ పొగాకు వ్యతిరేక దినోత్సవ ప్రతిజ్ఞ చేయించారు. ర్యాలీ పల్నాడు బస్టాండ్ వరకు ప్లకార్డులను ప్రదర్శిస్తూ పొగాకు ఉత్పత్తులను వాడరాదని నినదిస్తూ కొనసాగింది. కార్యక్రమంలో డెప్యూటీ డీఎంహెచ్‌ఓ డాక్టర్ చంద్రశేఖర్, ఎస్‌డీపీ నోడల్ ఆఫీసర్ డాక్టర్ హనుమకుమార్, మెటర్నల్ హెల్త్ ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నాగ పద్మజా పాల్గొన్నారు.

వెల్ఫేర్ సబ్సిడీ క్యాంటిన్ ఏర్పాటుకు చర్యలు

ఎస్పీ వకుల్ జిందాల్


క్యాంటిన్ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న ఎస్పీ వకుల్ జిందాల్

బాపట్ల టౌన్: పోలీసుశాఖ సిబ్బందికి వెల్ఫేర్ సబ్సిడీ క్యాంటిన్ ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్‌జిందాల్ తెలిపారు. బుధవారం ప్రధాన పోలీసు కార్యాలయంలో అల్పాహారం అందించేందుకు నూతనంగా ఏర్పాటు చేస్తున్న క్యాంటిన్ పనులకు శంకుస్థాపన చేశారు. సుదూరప్రాంతాల నుంచి వివిధ పనులపై వచ్చే వారికి, పోలీసు సిబ్బందికి తక్కువ ధరకే నాణ్యమైన ఆహార పదార్థాలను అందించేందుకు ఈ క్యాంటిన్ ఉపయోగపడుతుందని తెలిపారు. వీటితోపాటు త్వరలోనే పోలీసుశాఖ వెల్ఫేర్ సబ్సిడీ క్యాంటిన్ కూడా అందుబాటులోకి తీసుకువస్తామని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ పి.మహేష్, ఏఆర్ డీఎస్పీ ప్రేమ్‌కుమార్, ఎస్‌బీ సీఐ ఏ శ్రీనివాస్ పాల్గొన్నారు.

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి

పోలీసు సిబ్బంది సంక్షేమానికి కృషి చేస్తున్నట్లు ఎస్పీ వకుల్ జిందాల్ పేర్కొన్నారు. బాపట్ల ఎస్పీ కార్యాలయంలో పోలీసు గ్రీవెన్స్‌ను బుధవారం నిర్వహించారు. ప్రజా సేవలో నిత్యం విధి నిర్వహణలో ఉంటే పోలీసు సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యం ఇస్తామని ఎస్పీ తెలిపారు. వృత్తిపరమైన, ఆరోగ్యపరమైన, వ్యక్తిగతమైన పలు సమస్యలపై గ్రీవెన్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. కార్యక్రమంలో జిల్లా అడిషనల్ ఎస్పీ మహేష్, ఎస్‌బీ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్, డీపీఓ ఏ సెక్షన్ సూపరింటెండెంట్ షేక్ కరిముల్లా కాలేషావలి పాల్గొన్నారు.

వైఎస్సార్ కంటి వెలుగుతో మేలు

జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి విజయమ్మ


కంటి వెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారిణి విజయమ్మ

భట్టిప్రోలు: వైఎస్సార్ కంటి వెలుగు మూడో దశ కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్నట్లు జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి ఎస్.విజయమ్మ తెలిపారు. స్థానిక పీహెచ్‌సీ పరిధిలోని జెండా చెట్టు వద్ద వృద్ధులకు కంటి వైద్య శిబిరం బుధవారం నిర్వహించారు. సేవలను పరిశీలించిన విజయమ్మ మాట్లాడుతూ వైద్యశాలలకు రాలేని వృద్ధుల వద్దకు వచ్చి ఆయా ప్రాంతాల్లో కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వివరించారు. శిబిరాలను వృద్ధులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వృద్ధులను శిబిరాలకు తీసుకొచ్చేందుకు ఆశ కార్యకర్తలతో పాటు ఏఎన్ఎంలు శ్రద్ధ చూపాలని సూచించారు. ఏఎన్ఎంలు యాప్‌ల నిర్వహణలో అశ్రద్ధ చేయవద్దని హెచ్చరించారు. అనంతరం భట్టిప్రోలు పీహెచ్‌సీని సందర్శించి రికార్డులను పరిశీలించారు. సిబ్బంది పని తీరుపై ఆరా తీశారు. ఆమె వెంట సీహెచ్‌ఓ డి.మాతయ్య, పారా మెడికల్ అఫ్తాల్మిక్ అసిస్టెంట్ (పీఎంఓఏ) పెనుమాల అరుణరాణి, ఫార్మాసిస్ట్ కన్యకాదేవి ఉన్నారు.

కారు- లారీ ఢీకొని ఐదుగురికి గాయాలు


కొల్లూరు వద్ద చోటుచేసుకున్న ప్రమాదంలో నుజ్జునుజ్జు అయిన కారు

కొల్లూరు: ఎదురెదురుగా ప్రయాణిస్తున్న కారు, లారీ ఢీకొని ఐదుగురు గాయపడిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాలు.. తెనాలి మండలం మల్లెపాడుకు చెందిన కొందరు కారులో పెళ్లికి హాజరయ్యేందుకు మండలంలోని దోనేపూడి వెళుతున్నారు. కొల్లూరు దాటిన అనంతరం రేపల్లె- తెనాలి ప్రధాన రహదారిపై ఉన్న మలుపు వద్ద రేపల్లె వైపు నుంచి వస్తున్న లారీ- కారు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాద సమయంలో రెండు వాహనాలు అతి వేగంగా ఉండటంతో ప్రమాద తాకిడికి కారు నుజ్జునుజ్జు అయింది. ప్రమాద సమయంలో కారులో 6 గురు వ్యక్తులు ప్రయాణిస్తుండగా ఐదుగురు గాయాల బారిన పడగా, వీరిలో ఇద్దరు తీవ్రంగా గాయపడ్డారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న కొల్లూరు ఏఎస్ఐ రామయ్య ఘటనా ప్రాంతానికి చేరుకుని స్థానికుల సాయంతో క్షతగాత్రులను 108లో తెనాలి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. క్షతగాత్రులలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం తెనాలి నుంచి గుంటూరు జీజీహెచ్‌కు తరలించారు.

సొంత ఇల్లు లేని పేదల కష్టాలు వర్ణనాతీతం

- ఇల్లు లేని నిరుపేదల కష్టాలు వింటుంటే కళ్లుచెమ్మగిల్లుతున్నాయి
- ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డితో వారి కష్టాలు తీరాయి
- నెలరోజుల వ్యవధిలోనే ఇంటి నిర్మాణ పనులు ప్రారంభం
- మంగళగిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి (ఆర్కే)


కృష్ణాయపాలెంలో వడ్డేశ్వరం పేదలకు ఇంటి పట్టాలు అందజేస్తున్న మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి తదితరులు

తాడేపల్లిరూరల్ : సొంతిల్లు లేని పేదల కష్టాలు వర్ణనాతీతం. గతంలో వారి కష్టాల గురించి ఏదో ఒక చోట ఎవరో ఒకరు చెబుతూ ఉండేవారు. పట్టాలు పంచేటప్పుడు వారు పడ్డ కష్టాలు వింటుంటే కళ్లు చెమ్మగిల్లుతున్నాయని మంగళగిరి శాసనసభ్యులు ఆళ్ల రామకృష్ణారెడ్డి అన్నారు. బుధవారం ఎంటీఎంసీ పరిధిలోని తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం, మెల్లెంపూడి ప్రాంతాలకు చెందిన ఇళ్లు లేని పేదలకు సీఆర్‌డీఏ పరిధిలోని కృష్ణాయపాలెంలో ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఎమ్మెల్యే ఆర్కే, ఆప్కో చైర్మన్ గంజి చిరంజీవి, తాడేపల్లి తహసీల్దార్ నాగిరెడ్డి, వైఎస్సార్‌సీపీ నాయకులతో కలసి ఇళ్ల పట్టాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే ఆర్కే మాట్లాడుతూ పట్టాలు పంచుతున్న సమయంలో అద్దె ఇళ్లల్లో కాలవగట్ల మీద నివాసాలు ఏర్పరుచుకుని జీవిస్తున్న మహిళలు తమ ఆవేదనను వెలిబుచ్చారు. అద్దె ఇంట్లో నివాసముండే సమయంలో ఇంట్లో ఎవరైనా పెద్దవారు, ప్రమాదవశాత్తు ఎవరైనా మరణించినా వారు అద్దెకు నివాసముంటున్న ఇంటికి మృతదేహాన్ని తీసుకురానిచ్చేవారు కాదని, ఎక్కడో రోడ్లమీద మృతదేహాన్ని ఉంచి అంత్యక్రియలు నిర్వహించి కర్మకాండలు చేసేదాకా ఇంటికి రాకుండా సుదూర ప్రాంతాల్లో ఉన్న సత్రాల్లో బిక్కుబిక్కుమంటూ ఉండేవాళ్లమని, కాలవగట్ల మీద, చెరువు కట్ల మీద నివాసం ఉండేటప్పుడు ప్రతిసారీ ఇళ్లు తొలగిస్తామని సంబంధిత అధికారులు నోటీసులిచ్చేవారని, ఆందోళనలో ఎక్కడకు వెళ్లాలో తెలియక బిక్కుబిక్కు మంటూ బతికేవారమని వారు ఆవేదన వ్యక్తం చేశారన్నారు. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మాకు భరోసా లభించిందని, మాసొంత ఇంటి కల నెరవేరుతోందని వారు అన్నారని అన్నారు. సీఆర్‌డీఏ పరిధిలో మంగళగిరి తాడేపల్లి కార్పొరేషన్ పరిధిలో పేదలకు కేటాయించిన ఇళ్ల స్థలాల్లో ఇంటి నిర్మాణ పనులు చేపడతామని, ఆ లోపు ఇంటి నిర్మాణానికి కావలసిన అన్ని మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన స్పష్టం చేశారు.

జగనన్నకే తప్ప వేరెవరికీ ఓటేయను



నాకు ఓటు హక్కు వచ్చిన తరువాత ఇప్పటి వరకు టీడీపీకే ఓటేశా. చంద్రబాబు నాయుడు హయాంలో మా కుటుంబానికి ఎటువంటి మేలు జరగలేదు. ఎన్టీఆర్ అభిమానం మీద ఆయనకు ఓటు వేస్తున్నాం. జగన్‌బాబు ప్రభుత్వం వచ్చిన తరువాత మా కుటుంబం అన్ని విధాలా లబ్ధి పొందింది. ఇల్లు లేని లోటు కూడా ఈ ప్రభుత్వంలోనే తీరింది. గతంలో ఇంటి కోసం టీడీపీ నాయకుల చుట్టూ తిరిగా. ఇప్పుడు ఏ నాయకుడి దగ్గరకు వెళ్లకుండానే నాకు ఇల్లు వచ్చింది. బతికున్నంత కాలం జగన్‌కు తప్ప ఎవరికీ ఓటు వేయను.

-సంపతి కామాక్షమ్మ, మెల్లెంపూడి

నాకు ఊహ తెలిసి సొంతిల్లు లేదు



నాకు ఊహ వచ్చినప్పటి నుంచి మా అమ్మా నాన్నకు ఇల్లు లేదు. మా అత్తా మామలకు ఇల్లులేదు. నా భర్తకూ ఇల్లు లేదు. ఇప్పుడు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పుణ్యమాని నాకు ఇంటి స్థలం వచ్చింది. ప్రభుత్వమే ఇల్లు కూడా నిర్మించి ఇస్తానంది. నేను చీపుర్లు అమ్ముకుని జీవిస్తున్నా. నాకు సొంత ఇల్లు ఉంటే ఒంటరిగా ఉన్న నా జీవితానికి భరోసా లభిస్తుంది. తిన్నా తినకపోయినా సొంత ఇంట్లో ఉండొచ్చు. ఎమ్మెల్యే ఆర్కే ప్రభుత్వమే ఇళ్లు నిర్మిస్తుందని నాకు చెప్పాడు. నా సొంత ఇంట్లోనే నేను కన్ను మూయాలి.

-కాటమ్మ, వడ్డేశ్వరం

ఎంతోమంది దగ్గరకు తిరిగా



మా కుటుంబానికి ఇల్లు లేక పోవడం, అద్దెకు ఉంటూ అద్దెలు కట్టలేకపోవడంతో ఇల్లు కోసం ఏ పార్టీవారు మీటింగ్‌కు పిలిచినా ఇంటి స్థలం ఇస్తారనే ఆశతో వెళ్లేవాళ్లం. జగనన్న ప్రభుత్వం వచ్చిన తరువాత మేం ఎక్కడికీ వెళ్లకుండానే, ఎవరి చుట్టూ తిరగకుండానే ఉచితంగా మాకు ఇళ్లు కేటాయించారు. మళ్లీ జగన్ ముఖ్యమంత్రి అయితే మా జీవితాల్లో మార్పు వస్తుంది.

- కామాక్షమ్మ, వడ్డేశ్వరం

ఇళ్ల స్థలం మాకు వరం



జగనన్న ఇచ్చిన ఈ ఇళ్ల స్థలం మాకు వరం. మా పెళ్లయిన దగ్గర నుంచి అద్దె ఇళ్లల్లోనే నివాసముంటున్నాం. కూలి పని చేసుకునే మాకు రెండు వేలు కట్టడమే చాలా ఇబ్బందిగా ఉండేది. ఇంటి స్థలం కేటాయించడంతో పాటు ఇల్లు కట్టుకునేందుకు కూడా డబ్బులు ఇస్తున్నారు. మేము త్వరలోనే మా ఇంట్లో నివాసముంటాం. మా ఇళ్ల ముందు కూడా పెద్ద పెద్ద రోడ్ల నిర్మాణం జరుగుతోంది.

-బత్తుల చంద్రమ్మ, వడ్డేశ్వరం

కారు డ్రైవర్‌కు దేహశుద్ధి

చేబ్రోలు: మద్యం మత్తులో కారు నడిపిన డ్రైవరుకు స్థానికులు దేహశుద్ధి చేసిన ఘటన వడ్లమూడిలో బుధవారం చోటుచేసుకుంది. ఈ ఘటనలో రెండు ఆటోలు, నాలుగు బైక్‌లు, రోడ్డు పక్కన వెళ్తున్నవారిని ఢీ కొట్టడంతో ఆరుగురికి గాయాలైనాయి. నారాకోడూరు గ్రామానికి చెందిన సుమన్ తెనాలి నుంచి నారాకోడూరు వైపునకు కారులో వస్తూ సంగం జాగర్లమూడి సమీపంలో ఓ బైక్‌ను ఢీ కొట్టాడు. ఆపకుండా అతివేగంగా నడుపుతూ వడ్లమూడి గరువుపాలెం వంతెన వద్ద ఆటోను ఢీ కొట్టాడు. మరి కొంతదూరం వచ్చిన తరువాత అడ్డదిడ్డంగా డ్రైవింగ్ చేస్తూ రోడ్డు పక్కను వెళ్తున్న వారిని, ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాలను ఢీ కొట్టాడు. వడ్లమూడి అడ్డరోడ్డు వద్ద కారును చేబ్రోలు వైపుకు తిప్పి వేగంగా పోతుండటంతో స్థానికులు, యువకులు వెంబడించారు. గొడపాలెం ప్రభుత్వ పాఠశాల వద్ద గోడను ఢీ కొట్టి కారు నిలిచిపోవడంతో కారు డ్రైవర్‌ను స్థానికులు పట్టుకుని దేహశుద్ధి చేసి పోలీసులకు అప్పచెప్పారు. మద్యం మత్తులో కారును నడపటమే ప్రమాదానికి కారణంగా పోలీసులు భావిస్తున్నారు. చేబ్రోలు ఎస్ఐ వెంకటాద్రి కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

రైతులకు సబ్సిడీపై యంత్రపరికరాలు


మాట్లాడుతున్న సలహా మండలి జిల్లా చైర్మన్ మార్కొండారెడ్డి

నరసరావుపేట: జిల్లాలోని రైతులకు వ్యక్తిగత సబ్సిడీపై వ్యవసాయ యంత్ర పరికరాలు అందజేయాలని జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ కుర్రి సాయి మార్కొండారెడ్డి కోరారు. కలెక్టరేట్‌లోని సమావేశం హాలులో వ్యవసాయ సలహా మండలి సమావేశం బుధవారం నిర్వహించారు. అధ్యక్షత వహించి మాట్లాడారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా విత్తనాలు, ఎరువులు రైతులకు సరఫరా చేయాలని, కౌలు రైతులకు కార్డులు త్వరగా అందజేసి ప్రభుత్వ పథకాల ద్వారా వారికి లబ్ధిచేకూర్చాలని కోరారు. జిల్లా రెవెన్యూ అధికారి కె.వినాయకం మాట్లాడుతూ వ్యవసాయ, అనుబంధ విభాగాల్లో రైతుల నుంచి వచ్చే సందేహాలకు సలహా మండలి సభ్యులు, అభ్యుదయ రైతులు చర్చించుకొని రైతులకు నివృత్తి చేయాలన్నారు. జిల్లా వ్యవసాయాధికారి ఐ.మురళి మాట్లాడుతూ జిల్లాలోని అన్నీ ఆర్‌బీకేల ద్వారా రైతులకు పచ్చిరొట్ట విత్తనాలు 50శాతం రాయితీపై అందజేస్తున్నామని తెలిపారు. ఇప్పటి వరకు 3,500 క్వింటాళ్ల సరఫరా చేశామని, ఇంకా కావాల్సినంత సరఫరా చేస్తామన్నారు. జిల్లాలోని 137 కమ్యూనిటీ హైరింగ్ సెంటర్లకు మెగా మేళా-2 ద్వారా 137 ట్రాక్టర్లు, వివిధ రకాల యంత్రపరికరాలు జూన్ రెండున ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీద అందజేయటం జరుగుతుందని వ్యవసాయాధికారి వెల్లడించారు. ట్రైనీ కలెక్టర్ కల్పశ్రీ పాల్గొన్నారు.

విజయలక్ష్మికి పరుచూరి స్మారక జీవితకాల పురస్కారం


కలనేత నాటకంలోని ఓ దృశ్యం


విజయలక్ష్మికి పరుచూరి విజయలక్ష్మి పురస్కారం అందజేస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు తదితరులు

పల్లెకోనలో ముగిసిన నాటకోత్సవాలు

పల్లెకోన(భట్టిప్రోలు): పరుచూరి విజయలక్ష్మి స్మారక జీవితకాల పురస్కారాన్ని ప్రముఖ నటి ఎ.విజయలక్ష్మి(విజయవాడ)కి పరుచూరి వెంకటేశ్వరరావు అందజేశారు. పరుచూరి రఘుబాబు స్మారక అఖిల భారత నాటకోత్సవాలు బుధవారం ముగిశాయి. పరుచూరి రఘుబాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 31వ డాక్టర్ డి.రామానాయుడు అఖిల భారత ఆహ్వాన నాటకోత్సవాలు నాలుగు రోజుల పాటు నిర్వహించారు. ప్రముఖ సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు కుమారుడు రఘుబాబు స్మారకంగా నాటకోత్సవాలు 2010 నుంచి పల్లెకోనలో నిర్వహిస్తున్నారు. మొత్తం ఆరు నాటకాలను ప్రదర్శించారు. నాటకోత్సవ సమన్వయకర్త డి.రామకోటేశ్వరరావు కార్యక్రమాలను పర్యవేక్షించగా, వ్యాఖ్యాతగా డాక్టర్ అయినాల మల్లేశ్వరరావు వ్యవహరించారు. కార్యక్రమంలో మెమోరియల్ ట్రస్ట్ కోశాధికారి వీవీ రాజగోపాల్, పద్మావతి, వేజండ్ల బసవపున్నారావు, మండవ వెంకటేశ్వరరావు పాల్గొన్నారు. నాటక పోటీల విజేతలకు ప్రముఖ సినీ దర్శకులు ఎన్.శంకర్ బహుమతులు ప్రదానం చేశారు.

హజ్ యాత్రికుల బసకు ప్రత్యేక ఏర్పాట్లు

- రాష్ట్రం నుంచి హజ్ యాత్రకు 1790 మంది
- మదరసాలో ఏర్పాట్లను పరిశీలించిన డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా


యాత్రికుల బస వసతి ఏర్పాట్లను పరిశీలిస్తున్న డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా, హజ్ కమిటీ చైర్మన్ గౌసమ్ అజామ్ తదితరులు

పెదకాకాని: పవిత్ర హజ్‌యాత్రకు వెళ్లేవారు తొలిసారిగా గన్నవరం ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన ఎంబార్కేషన్ పాయింట్ నుంచి బయలు దేరుతారని రాష్ట్ర డెప్యూటీ సీఎం, మైనార్టీ సంక్షేమశాఖ మంత్రి అంజాద్ బాషా పేర్కొన్నారు. గుంటూరు జిల్లా పెదకాకాని మండలం, నంబూరు మదరసా ఏ సిరాజుల్ ఉలూమ్‌లోని హజ్ యాత్రికులు బస చేసేందుకు జరుగుతున్న ఏర్పాట్లను బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా డెప్యూటీ సీఎం అంజాద్‌బాషా మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు హజ్ యాత్రికులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా పూర్తిస్థాయిలో అన్ని ఏర్పాట్లు చేస్తున్నామని చెప్పారు. గన్నవరం ఎంబార్కేషన్ పాయింట్ నుంచి 1790 మంది హాజీలు హజ్ యాత్రకు బయలుదేరి వెళుతున్నారని వివరించారు. మదరసా ఏ సిరాజుల్ ఉలూమ్‌లో ఏర్పాటు చేసిన హజ్ క్యాంపునకు 24 గంటలు ముందుగా హాజీలు రిపోర్టు చేసి లగేజీ హ్యాండోవర్ చేయాల్సి ఉంటుందని చెప్పారు. ఎయిర్‌పోర్ట్ అధికారుల సూచనల మేరకు హజ్ యాత్రికుల లగేజీ కోసం స్ట్రాంగ్‌రూం, లగేజీ స్కానింగ్ మిషన్‌రూం, ఏర్పాటు పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు. గన్నవరం నుంచి జూన్ 7వ తేదీన 170 మంది యాత్రికులతో జద్దాకు ఒక విమానం వెళుతుందన్నారు. వారందరికీ ఇక్కడ వసతులు కల్పించడం జరిగిందని వారితో పాటు వచ్చే బంధువులకు హజ్ క్యాంప్ వెలుపల వసతి సౌకర్యం కలిగించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయన్నారు. భోజనాలకు సంబంధించి అన్ని పనులు కాంట్రాక్ట్ పద్ధతిలో అప్పగించడం జరిగిందని, పనులు వేగవంతంగా జరుగుతున్నాయని వివరించారు. రాష్ట్రం నుంచి వెళుతున్న హాజీలకు ప్రయాణ తేదీలకు సంబంధించిన షెడ్యూల్ విడుదల చేసినట్లు చెప్పారు. ఈనెల 7 నుంచి 19వ తేదీ వరకు గన్నవరం ఎయిర్‌పోర్టు నుంచి ప్రతిరోజూ ఒక విమానం బయలు దేరుతుందని వెల్లడించారు. ఇప్పటికే హజ్ కమిటీ ద్వారా ప్రయాణికులకు సమాచారం ఇవ్వడం జరిగిందన్నారు. లగేజీ మదరసాలోనే స్కానింగ్ చేసి బోర్డింగ్ పాస్ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. హజ్ యాత్రికులు సౌకర్యాలు కల్పించేందుకు మైనార్టీ సంక్షేమశాఖ కమిషనర్, జిల్లా కలెక్టర్‌తో పాటు జిల్లా యంత్రాంగం ఏర్పాట్లలో నిమగ్నమయ్యారన్నారు. హజ్ క్యాంపు వద్ద ఏర్పాట్లను పరిశీలించేందుకు ప్రత్యేకంగా ఉర్దూ అకాడమీ డైరెక్టర్ అయూబ్ హుస్సేన్‌ను నియమించడం జరిగిందన్నారు. తొలిసారి ప్రతిష్టాత్మకంగా ఆంధ్రప్రదేశ్ నుంచి పవిత్ర హజ్ యాత్రకు వెళుతున్న యాత్రికులను కలిసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని ఆహ్వానించడం జరిగిందన్నారు. హజ్ క్యాంపు వద్ద ఇప్పటికే ఏర్పాట్లు యుద్ధ ప్రాతిపదికన జరుగుతున్నాయి. మదరసాను సందర్శించిన వారిలో వక్ఫ్‌బోర్డు సీఈఓ ఖాదర్‌వలి, హజ్ కమిటీ చైర్మన్ గౌసమ్‌అజామ్, రాష్ట్ర మైనార్టీ వ్యవహారాల సలహాదారుడు ఎస్ఎం జియావుద్దీన్, హజ్ కమిటీ డైరెక్టర్ బాసిత్, గుంటూరు నగర డెప్యూటీ మేయర్ షేక్ సజీల, ఉర్దూ అకాడమీ డైరెక్టర్ డాక్టర్ అయూబ్‌హుసేన్, డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఎ.శ్రావణ్‌బాబు, పెదకాకాని తహసీల్దార్ పి.రత్నం, దర్గా ఈఓ ముక్తార్ బాషా, జిల్లా వక్ఫ్‌బోర్డు డైరెక్టర్ ఎస్ఎం సుభాని, గులాం రసూల్, పంచాయతీ కార్యదర్శి షేక్ సుభాని, మైనార్టీశాఖ అధికారులు, హజ్ కమిటీ సభ్యులు, మదరసా నిర్వాహకులు ఉన్నారు.

సీఎం పర్యటనకు పటిష్ట బందోబస్తు

నగరంపాలెం: ఈనెల 2న సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గుంటూరు నగర పర్యటన దృష్ట్యా పటిష్టమైన పోలీస్ బందోబస్త్ ఏర్పాటు చేసినట్లు జిల్లా ఎస్పీ కె.ఆరిఫ్‌హఫీజ్ తెలిపారు. సీఎం పర్యటన దృష్ట్యా నగరంపాలెంలోని జిల్లా పోలీస్ కార్యాలయ (డీపీఓ) ఆవరణలోని స్పందన హాల్‌లో బుధవారం సమీక్ష సమావేశం జరిగింది. అనంతరం పోలీస్ పెరేడ్ గ్రౌండ్‌లో ఆయన పర్యటించారు. ఎస్పీ మాట్లాడుతూ పోలీస్ పెరేడ్‌గ్రౌండ్‌లో హెలిప్యాడ్ చుట్టు కట్టుదిట్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలని అన్నారు. సరిపడా పోలీస్ సిబ్బందితో పహారా నిర్వహించాలని ఆదేశించారు. హెలిప్యాడ్ నుంచి చుట్టుగుంట సర్కిల్ వెళ్లే మార్గంలో ఇరువైపులా భద్రతా బలగాలతో అణువణువు గాలిస్తూ, ముమ్మరంగా తనిఖీలు చేపట్టాలని అన్నారు. ప్రత్యేక బలగాలతో హెలిప్యాడ్, చుట్టుగుంట సర్కిల్ వద్ద జరగనున్న సభ పరిసర ప్రదేశాలలో కూంబింగ్ నిర్వహించాలన్నారు. అవాంఛనీయ ఘటనలు తలెత్తకుండా జాగ్రత్తగా ఉండాలని అన్నారు. ఏ ఒక్కరూ విధుల్లో అలసత్వం ప్రదర్శించవద్దని అన్నారు. సమావేశంలో ఏఎస్పీలు ఎస్.షేక్కే (గుంటూరు తూర్పు), కె.సుప్రజ (పరిపాలన), కె. శ్రీనివాసరావు (ఎల్అండ్ఓ), శ్రీనివాసరావు (క్రైం), కె.కోటేశ్వరరావు (ఏఆర్), డీఎస్పీలు పోతురాజు, బాలసుందరరావు, సుభాష్, ఉమామహేశ్వరరెడ్డి, జనార్ధన్‌రావు, కేసీహెచ్ రామారావు, శ్రీనివాసరావు, ఎస్‌బీ, డీసీఆర్‌బీ సీఐలు నరసింహారావు, శ్రీనివాసరావు, బాల సుబ్రహ్మణ్యం, నగరంపాలెం పీఎస్ సీఐ హైమారావు, ఆర్ఐలు పాల్గొన్నారు.